

కన్నీటి సుడిగుండం

ఈత సరదా చిన్నారుల ప్రాణాలు తీస్తోంది. ఎంతో మంది విద్యార్థులు ఈతకు వెళ్లి మృత్యువాతపడి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలిస్తున్నారు. - 8లో..



భగ్గుమన్న వైద్య లోకం

కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి క్రూరంగా హత్యచేయడంపై ఒంగోలులో వైద్య లోకం భగ్గుమంది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35/28

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

వీఆర్‌కు జరుగుమల్లి ఎస్సై

సాక్షి ఎఫెక్ట్..

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి ఎస్సై వి.వెంకటేశ్వరరావును వీఆర్‌కు బదిలీ చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇసుక మాఫియా సమక్షంలో ఎస్సై వెంకటేశ్వరరావు తన పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో శుక్రవారం 'ఏమా బంధం, ఏమా సంబరం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన ఎస్పీ దామోదర్.. ఇసుక మాఫియాతో సంబంధాలు కొనసాగిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావును వీఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే స్పందించి ఎస్సైపై చర్యలు తీసుకున్న ఎస్పీ దామోదర్‌ను మండల ప్రజలు అభినందిస్తున్నారు. ప్రస్తుతం జరుగుమల్లి ఇన్‌చార్జి ఎస్సైగా టంగుటూరు ఎస్సై పున్నారావు బాధ్యతలు నిర్వర్తించనున్నట్లు సీఐ సీహెచ్ హజరత్తయ్య వివరించారు.

ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: ఒంగోలు పోలీసు ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేవీ శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఇంటెలిజెన్స్‌లో నాన్ కేడర్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు పీటీసీ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ఏఆర్ దామోదర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. అలాగే సెబ్ అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.సూర్యచంద్రరావును సీఐడీ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు.

నేడు 99 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

ఒంగోలు: కోరం లేకపోవడం, కోర్టు కేసులు, తదితర కారణాలతో ఇటీవల జిల్లాలోని 99 పాఠశాలల్లో నిర్వహించలేకపోయిన పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను శనివారం నిర్వహించనున్నట్లు సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 87 జిల్లా పరిషత్ పాఠశాలలు, 12 ఎయిడెడ్ పాఠశాలల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక, ప్రమాణ స్వీకారం, తొలి సమావేశం జరుగుతాయని తెలిపారు.

19న జిల్లాస్థాయి అథ్లెటిక్స్

ఒంగోలు: స్థానిక మినీ స్టేడియంలో ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రరావు, మారుబోయిన వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాలలో క్రీడాకారులకు పోటీలు జరుగుతాయన్నారు. అండర్-14కు 2010 అక్టోబర్ 10 నుంచి 2012 అక్టోబర్ 9 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. అండర్-16కు 2008 అక్టోబర్ 10 నుంచి 2010 అక్టోబర్ 9 మధ్య జన్మించిన వారు, అండర్-18కు 2006 అక్టోబర్ 10 నుంచి 2008 అక్టోబర్ 9 మధ్య జన్మించిన వారు, అండర్-20కి 2004 అక్టోబర్ 10 నుంచి 2006 అక్టోబర్ 9 మధ్య జన్మించిన వారు అర్హులని వివరించారు. బాలబాలికలు ఎవరైనా హాజరుకావచ్చని, పూర్తి వివరాలకు డి.రాజునాయక్ (76750 26220)ను సంప్రదించాలని సూచించారు.

17, 19 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఈ నెల 17, 19 తేదీల్లో నిర్వహించాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న కాంప్లెక్స్ పరిధిలోని 50 శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, తెలుగు, గణితం, బయాలజీ టీచర్లు, నియోజకవర్గ స్థాయిలోని పీఈటీ/పీడీలకు సమావేశం నిర్వహించాలని సూచించారు. 19న మిగిలిన 50 శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, హిందీ, ఇంగ్లిష్, ఫిజిక్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన టీచర్లకు సమావేశం నిర్వహించాలని సూచించారు. వందశాతం మంది ఉపాధ్యాయులు ఈ సమావేశాలకు హాజరుకావాలని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.20 గంటల వరకు సమావేశం జరుగుతుందన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్, ఎంఈవోలు సమన్వయంతో రిసోర్సు పర్సన్‌ను ఎంపిక చేసుకుని అజెండా ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏదైనా స్కూల్ కాంప్లెక్స్ నిర్వహించే పాఠశాలలో విద్యా కమిటీ ఉన్నట్లయితే ఆ పాఠశాలలో మాత్రం ఈ నెల 20న కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలని చెప్పారు. ఇతర పాఠశాలల్లో యథావిధిగా సమావేశం నిర్వహించాలని, అందుకు ఉప విద్యాశాఖ అధికారులు, డైట్ సిబ్బంది, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సుభద్ర సూచించారు.

'అన్న' పేరు.. అనకొండల తీరు!

పేదలకు అన్నం పెడుతున్నామంటూ ఖజానాకు సున్నం వేస్తున్నారు టీడీపీ కూటమి నాయకులు. అన్న క్యాంటీన్లకు మరమ్మతుల పేరుతో దోపిడీ పర్వానికి తెరతీశారు. వాడుకలో ఉన్న భవనాలకు పచ్చ రంగులతో హంగులద్ది, స్వల్ప స్థాయి మరమ్మతులు చేపట్టి రూ.లక్షలు మింగేశారు. ఒంగోలు నగర నడిబొడ్డున ఉన్న ఒక అన్న క్యాంటీన్‌కు మరమ్మతుల పేరుతో రూ.11 లక్షలకుపైగా ఖర్చు చేశారంటే ఏ మేరకు నిధులు మెక్కేశారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జూన్‌లో పంపిన అంచనాలు జూలై నెలలో అమాంతంగా పెంచేయడం వెనుక అసలు మతలబు అదే. పేరుకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచారేగానీ పచ్చ నేతలకే పనులప్పగించి దోపిడీ తంతును దిగ్విజయంగా కానిచ్చేశారు.

- అన్నా క్యాంటీన్ల పేరుతో ప్రజాధనం దోపిడీ
- బాగున్న భవనాలకు మరమ్మతుల కోసం నిధులు మంజూరు
- పేరుకే ఆన్‌లైన్ టెండర్.. పనులు అప్పగించింది పచ్చ నేతలకే..
- ఒంగోలులో 4 క్యాంటీన్ల మరమ్మతులకు చేసిన ఖర్చు రూ.36.70 లక్షలు
- ఆన్‌లైన్ టెండర్లలో కోట్ చేసింది మాత్రం రూ.27.20 లక్షలు
- ఒంగోలు నగరపాలక సంస్థ నుంచి అదనంగా గుంజింది రూ.9.50 లక్షలు



ఒంగోలులోని ప్రకాశం భవనం ఎదురు పాత రిమ్స్ ప్రాంగణంలో అంబేద్కర్ భవన్‌కు వెళ్లే మార్గంలో అన్నా క్యాంటీన్ భవనం మరమ్మతులకు చేసిన ఖర్చు అక్షరాలా రూ.11 లక్షలు. మొన్నటి వరకు ప్రెస్ క్లబ్‌గా ఉపయోగించిన ఈ భవనానికి అంత స్థాయిలో ఏం మరమ్మతులు చేశారంటూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు సైతం నివ్వెరపోతున్నారు.

వ్యయం 30 % ఆదాయం 70 %

పాత సీసాలో కొత్త సారా మాదిరిగా తయారైంది క్యాంటీన్ల మరమ్మతుల వ్యవహారం. భవనాలకు పచ్చ రంగులు అద్దే కార్యక్రమమే ప్రధానంగా కనపడుతోంది. సీసీ కెమెరాలు, పైపు లైన్ల ఏర్పాటు, డైనింగ్ బల్లలు కొనుగోలు చేయడంతో సహా అన్నీ చిన్నచిన్న మరమ్మతులే. అయితే పచ్చ నేతలు టెండర్‌లో కోట్ చేసిన అంచనా వ్యయంలో 30 శాతం ఖర్చు చేసి 70 శాతం జేబుల్లో వేసుకున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పేదలకు అన్నం పెట్టేందుకు ఎవరూ వ్యతిరేకం కాదు కానీ, ఆ పేరుతో ప్రజల సొమ్ము దోచుకోవడంపైనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇది ఆర్టీసీ డిపో పక్కనే కూరగాయల మార్కెట్‌లో ఉన్న అన్నా క్యాంటీన్ భవనం. ఫ్లోరింగ్ చెక్కు చెదరలేదు. మరమ్మతుల పేరుతో రూ.9.50 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపారు. అన్నీ బాగున్నా రంగులేసి నిధులు బొక్కేశారని మార్కెట్‌లో ఒకటే చర్చ.



ఒంగోలు నగరంలో కర్నూలు రోడ్డులోని పవర్ ఆఫీసు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ఇది. గడిచిన ఐదేళ్లుగా ఇందులో వార్డు సచివాలయం నిర్వహించారు. దీనికి మరమ్మతుల పేరుతో రూ.7.70 లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారు.



కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని పాత టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కనే రైతు బజారులో ఉన్న క్యాంటీన్ భవనం మరమ్మతులకు రూ.8.50 లక్షలు ఖర్చు చేసినట్లు కాకి లెక్కలు చూపారు. అందులో వార్డు సచివాలయం నిర్వహించారు. వాడుకలో ఉన్న భవనానికి ఇంత ఖర్చు చేయడంపై జనం నివ్వెరపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఐదేళ్లపాటు అధికార దర్పానికి దూరమై.. అక్రమార్జనకు అవకాశం లేక.. చేష్టలుడగిన పచ్చ నేతలకు కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే ప్రాణం లేచొచ్చింది. మూసుకుపోయిన దోపిడీ మార్గాలు ఆగమేఘాలపై తెరుచుకున్నాయి. మట్టి, ఇసుకను కొల్లగొడుతూ రూ.లక్షలు గడిస్తున్న టీడీపీ నేతలు.. చివరకు అన్న క్యాంటీన్లను కూడా వదలడం లేదు. ఇప్పటికే వినియోగంలో ఉన్న భవనాలకు మరమ్మతుల పేరుతో రూ.లక్షల్లో బొక్కేశారు. ఈ ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రభుత్వం అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జూలై నెలలో క్యాంటీన్ల మరమ్మతులు నిర్వహించేందుకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. వాటిని ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆన్‌లైన్ టెండర్లకు నోటిఫికేషన్ ఇవ్వటం.. ఆ టెండర్లన్నీ టీడీపీ నేతలే సిండికేట్‌గా మారి దక్కించుకోవడం చకచకా జరిగిపోయాయి. అయితే జూన్‌లో వేసిన అంచనాలు ఒక్క నెలలోనే అమాంతం పెరిగిపోయాయి. టెండర్‌లో కోట్ చేసిన అంచనాలకు, క్యాంటీన్ భవనాల మరమ్మతు ఖర్చులకు పొంతనే లేకుండాపోయింది.

ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో గతంలో నాలుగు అన్న క్యాంటీన్లు ఉండేవి. అధికారంలోకి రాగానే వీటిని పునరుద్ధరించాలని నిర్ణయించారు. వీటిని వాడుకలోకి తెచ్చేందుకు రూ. 27.20 లక్షలు ఖర్చు అవుతుందని అంచనాలను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించారు. చివరకు ఆన్‌లైన్ టెండర్లలో కూడా టీడీపీ కాంట్రాక్టర్లు కూటమి కట్టారు. భవనాలను మరమ్మతులు చేసేందుకు టెండర్‌లు దక్కించుకున్నారు. వాస్తవానికి అధికారులు అంచనాలు రూపొందించినప్పుడే టీడీపీ నాయకులు దగ్గర కూర్చొని అంచనాలను పెంచి మరీ వేయించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద నాలుగు క్యాంటీన్ భవనాలకు రూ.లక్షలు ఖర్చు చేస్తేనే చాలా ఎక్కువ ఖర్చు పెట్టినట్లు లెక్క. అలాంటిది ముందు పంపిన అంచనాలు పెంచి మరీ మరో రూ.17 లక్షలకు పైగా కాకి లెక్కలు చూపి అంచనాల్లో పొందుపరిచారు.

బాగున్న ఫ్లోరింగ్‌కు మరమ్మతులు

క్యాంటీన్ భవనాల మరమ్మతుల్లో అక్రమాలు అన్నీ.. ఇన్నీ కావు. టీడీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు వాడిన భవనాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వార్డు సచివాలతో పాటు ఇతర అవసరాలు వాడుతూ వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పట్లో వాటికి మరమ్మతులు చేసి మరీ భవనాలను వాడుకలోకి తెచ్చింది. అయితే తిరిగి అధికారంలోకి వచ్చిన టీడీపీతో పాటు కూటమి పార్టీ నేతలు జేబులు నింపుకోవటమే పరమావధిగా నిర్ణయించుకొని మరమ్మతుల పేరిట నిలువుదోపిడీకి తెరలేపారు. క్యాంటీన్ భవనాల ప్రాంగణాల్లో ఉన్న ఫ్లోరింగ్‌లు బాగా ఉన్నా సరిచేశామంటూ నిధులు స్వాహా చేస్తున్నారు.

నగర పాలక సంస్థ నుంచి అదనంగా రూ.9.50 లక్షలు

నాలుగు క్యాంటీన్ల మరమ్మతులు చేసేందుకు ఒంగోలు నగర పాలక సంస్థ నిధుల నుంచి అదనంగా మరో రూ.9.50 లక్షలు టీడీపీ కాంట్రాక్టర్లకు అప్పనంగా కట్టబెట్టారు. అంచనాలు రూపొందించిన సమయంలోనే అంచనాలు పెంచిమరీ అధికారుల చేత వేయించుకున్న టీడీపీ నేతలు అవి చాలవన్నట్లు ఒంగోలు నగర ప్రజల సొమ్మును కాజేసేందుకు పథకం రచించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మార్కాపురం పట్టణంలోని ఏబీఎం హైస్కూల్ ఎదురుగా గతంలో ఉన్న అన్నా క్యాంటీన్ మరమ్మతులకు రూ.10 లక్షలను కూటమి ప్రభుత్వం కేటాయించింది. కేవలం మరమ్మతుల కోసం ఇంత పెద్ద మొత్తంలో వెచ్చించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. మరమ్మతుల పేరుతో ప్రజాధనాన్ని టీడీపీ నాయకులు దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.



కనిగిరి పట్టణంలోని పాత అన్నా క్యాంటీన్ మరమ్మతులకు రూ.4.50 లక్షలు కేటాయించారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో కనిగిరిలోని తీగలగొంది రోడ్డులో నామమాత్రంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌కు అప్పట్లోనే సుమారు రూ.40 లక్షలు వెచ్చించి సగానికిపైగా దోచేశారు. మళ్లీ అదే క్యాంటీన్‌కు మరమ్మతుల పేరుతో నిధులు కాజేయడం విమర్శలకు తావిస్తోంది.



గిద్దలూరులోని అన్నా క్యాంటీన్ మరమ్మతులకు కూడా రూ.5.20 లక్షలు కేటాయించారు. చిన్నపాటి మరమ్మతులకు కూడా లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి టీడీపీ నేతలు దోచుకునేందుకు సీఎం చంద్రబాబు అవకాశం కల్పిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

పోలీస్ పోస్టింగుల్లో పచ్చ బేరం

- యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఎస్సై, సీఐ పోస్టులకు టీడీపీ నేతల ఓపెన్ ఆఫర్
- యర్రగొండపాలెం ఎస్సై పోస్టుకు రూ.15 లక్షలు
- 43 రోజులుగా ఖాళీగా ఉన్న ఎస్సై పోస్టు
- రూ.26 లక్షలు పలుకుతున్న సీఐ పోస్టు
- పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల ఎస్సైలను మార్చేందుకు పచ్చనేతల సన్నాహాలు
- పోటీపడుతున్న వివిధ ప్రాంతాల పోలీస్ అధికారులు
- అసహ్యించుకుంటున్న నియోజకవర్గ ప్రజలు



వై.పాలెం పోలీస్‌స్టేషన్


యర్రగొండపాలెం: ఎస్సై, సీఐ పోస్టింగుల్లో టీడీపీ నేతల బరితెగింపు బేరసారాలు చక్కర్లు కొడుతుండటంపై యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. పోలీస్ అధికారులు సైతం భారీగా ముడుపులు ముట్టజెప్పేందుకు సిద్ధమై పోస్టింగుల కోసం ఎగబడుతుండటంపై విస్తుపోతున్నారు. ఈ పరిణామాలు సమాజంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో ఊహించుకుని ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి వివక్ష లేకుండా విధులు నిర్వహించి సమాజంలో శాంతి భద్రతలను కాపాడి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీస్ అధికారులకు పోస్టింగుల కేటాయింపులో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరు యర్రగొండపాలెం నియోజకవర్గంలో సర్వత్రా చర్చనీయాంశమైంది. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో గత 43 రోజులుగా ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై సుదర్శనం గత నెల 4వ తేదీ అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఎస్సై పోస్టు టీడీపీ నేతల బేరసారాల కారణంగా ఎప్పటికి భర్తీ అవుతుందో అర్థంగాని పరిస్థితి నెలకొంది. టీడీపీకి చెందిన ఒక నాయకుడు ఈ పోస్టును రూ.15 లక్షలకు బేరం పెట్టాడు. అయితే, అంతకంటే ఎక్కువగా ఇచ్చేందుకు కొంతమంది పోలీస్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఒకటి, రెండు, మూడవసారి అని ఆ నాయకుడు పాట కొట్టేస్తే తప్ప రేంజ్ స్థాయి అధికారులు యర్రగొండపాలెం ఎస్సై పోస్టును భర్తీ చేసేలా లేరు. ఎన్నికల సమయంలో యర్రగొండపాలెం వచ్చిన సీఐ పరిస్థితి కూడా అంతంతమాత్రంగానే ఉంది. పచ్చనేతల తాకిడి తట్టుకోలేక ఎప్పుడెప్పుడు ఇతర ప్రాంతాలకు జంప్ అవుదామా అని ఆయన ఎదురు చూస్తున్నట్లు సమాచారం. ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేసుకుంటున్నారు. రూ.20 లక్షలు ఇచ్చి ఇదే పోస్టులో కొనసాగవచ్చుగానీ.. అంత డబ్బు తాను ఇవ్వలేనని ఆయన వద్దనుకున్నట్లు తెలుస్తోంది. గతంలో యర్రగొండపాలెం ఎస్సైగా విధులు నిర్వహించి ప్రస్తుతం సీఐ అయిన వ్యక్తి రూ.26 లక్షలు ఇచ్చి ఇక్కడకు రావాలనుకుంటున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అప్పటి వరకు పట్టణంలో శాంతి భద్రతలు కాపాడేందుకో, మరెందుకోగానీ.. అప్పుడప్పుడూ మార్కాపురం నుంచి డీఎస్పీ వచ్చి వెళ్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చిన వారిని ఎన్నికల తర్వాత బదిలీ చేయాల్సి ఉండగా, కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నప్పటికీ బదిలీలు జరగలేదు. టీడీపీ నేతలతో బేరం కుదరకపోవడమే దీనికి కారణమని నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల ఎస్సైలను కూడా బదిలీ చేయించేందుకు పచ్చనేతలు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా స్థానాల్లో పని చేయాలనుకునేవారు అడిగినంత డబ్బు ఇవ్వాల్సిందేనని అధికార పార్టీ నాయకుల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ముమ్మరంగా ప్రచారం జరుగుతోంది. చివరకు చేసేది లేక రేంజ్ కార్యాలయం నుంచి వచ్చే బదిలీ లెటర్ల కోసం కొందరు పోలీసు అధికారులు ఎదురుచూస్తున్నారు. కొంతమంది టీడీపీ నాయకులు ఆయా పోలీస్‌స్టేషన్లలో తిష్టవేసి ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నప్పటికీ.. పోలీసు అధికారులు, సిబ్బంది చేసేదిలేక నిమ్మకునీరెత్తినట్లు ఉండిపోతున్నారు. ఎన్నికల తర్వాత నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు చేసిన దాడులు, అల్లర్లను చూస్తూ ఊరుకున్న పోలీసులు.. ఇప్పుడు వారి వలనే కష్టాలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఎమ్మెల్యేకు ఎస్కార్ట్ రద్దు.. టీడీపీ నేతకు మాత్రం జీ హుజూర్...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ నాయకులను పోలీసులు నెత్తిన పెట్టుకుని తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది. కానీ, ప్రజలతో ఎన్నుకోబడిన ఎమ్మెల్యేను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేకు ఉండాల్సిన ఎస్కార్ట్ సదుపాయాన్ని పోలీస్ ఉన్నతాధికారులు రద్దు చేశారు. మీరు మాకొద్దంటూ నియోజకవర్గ ప్రజలు తిరస్కరించిన టీడీపీ నాయకుడికి మాత్రం ఎస్కార్ట్ సదుపాయం కల్పిస్తున్నారు. వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే పచ్చనేతల కాన్వాయ్‌కు ఎస్కార్ట్‌గా ఏకంగా ఎస్సైలు వెళ్తున్నారు. నియోజకవర్గంలోని కొంతమంది ఎస్సైలు ఎస్పీ ఆదేశాలను కూడా లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల మెప్పు పొందేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వారికి ఎస్కార్ట్‌గా తిరుగుతున్నారు. పచ్చనేతలు కరుణిస్తేనే తమకు కావాల్సిన చోటకు బదిలీలు ఉంటాయనే ఆశతో ఎమ్మెల్యేను సైతం వదిలేసి ఇష్టానుసారం ఎస్సైలు వ్యవహరించడాన్ని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

నిలకడగా పొగాకు ధరలు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కేజీ పొగాకు గరిష్ట ధర రూ.359 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 పొగాకు వేలం కేంద్రాల్లో 10,997 బేళ్లు వేలానికి రాగా, 9,500 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,497 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో శుక్రవారం 132వ రోజు నిర్వహించిన వేలానికి 5,675 బేళ్లు రాగా, 4,960 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 715 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.314.09 పలికింది.





వరలక్ష్మీ పాహిమాం...

వరలక్ష్మీ వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో వరలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. సామూహిక వరలక్ష్మీ వ్రతంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అచలానంద ఆశ్రమంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.


ఉపాధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ఉపాధి హామీ పథకం కింద క్లస్టర్లవారీగా చేపట్టే పనుల్లో లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా ఉండేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుపై స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. నిర్దేశించిన సీఆర్డీ యాక్షన్ ప్లాన్, 100 రోజుల ప్రణాళిక, 365 రోజుల ప్రణాళిక, లేబర్ బడ్జెట్, అభివృద్ధి పనులకు సంబంధించిన పనులు గుర్తించడం, హార్టీకల్చర్ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్లాంటేసన్, హౌసింగ్ 90 రోజులు, ఇతర నిర్దేశిత అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ అర్జున్‌రావు, పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, హౌసింగ్ పీడీ పేరయ్య, ఏపీఎంఐపీ పీడీ, ఉద్యానవన శాఖాధికారి గోపీచంద్ పాల్గొన్నారు.

బాల కార్మిక నిర్మూలనపై శ్రద్ధ వహించాలి...

జిల్లాలో బాలకార్మిక నిర్మూలనపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బాలకార్మిక నిర్మూలనపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం ప్రకాశం భవనంలో ఆమె సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలకార్మికులను నివారించేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాలలు పనిచేస్తుంటే వారికి పని నుంచి విముక్తి కలిగించి పాఠశాలలకు పంపాలన్నారు. సమావేశంలో డీఈఓ సుభద్ర, కార్మిక శాఖ ఉప కమిషనర్ గాయత్రిదేవి, పిల్లల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, సార్డ్ సంస్థ ప్రతినిధి సునీల్ కుమార్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకం సమావేశంలో కలెక్టర్

జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంబంధిత అధికారులతో శుక్రవారం స్థానిక ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. లక్ష్యాల మేరకు పనులను కచ్చితంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో రూ.654.67 కోట్లతో 2,424 పనులను ప్రతిపాదించగా, 1,721 పనులు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో ఇప్పటి వరకు 1,304 పనులు పూర్తయ్యాయని కలెక్టర్‌కు అధికారులు తెలిపారు. మరో 185 పనులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. 232 పనులు ఇంకా ప్రారంభం కాలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు కవలకుంట్ల సాల్మన్

మార్కాపురం రూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్ సర్వీసు వైరు తెగిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని దరిమడుగు ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కవలకుంట్ల సాల్మన్ (63) ఇంటిముందు కూర్చుని ఉండగా కోతులు ఇంటిపై ఉన్న సర్వీసు వైరును తెంపడంతో అది సాల్మన్ కుడి భుజంపై పడింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం సీఐ అవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ తెలిపారు. కాగా సాల్మన్ పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. దరిమడుగు సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపి, ఎంపీటీసీ కవలకుంట్ల పేతురు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

గిద్దలూరు రూరల్: బీజేపీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, పీరయ్య, రాజశేఖర్‌లపై గురువారం దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు పాలుగుళ్ల శ్రీనివాసరెడ్డి, గుర్రాల వలి మరి కొందరిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. ముగ్గురు వ్యక్తులపై వారు దాడి చేసి గాయపరచినట్లు చెప్పారు.

అటవీ ఉద్యోగిపై నాటుసారా కేసు

గిద్దలూరు రూరల్: నాటుసారా విషయంలో అటవీ శాఖ రాచర్ల సెక్షన్ పరిధిలో పనిచేస్తున్న జమాల్‌బాషాపై స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సురేష్ తెలిపారు. దిగువమెట్ట గ్రామానికి చెందిన హరి అనే వ్యక్తి నాటుసారాను తీసుకువచ్చి జమాల్ బాషాకు ఇవ్వడంతో ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఆరుగురు ఎస్‌ఐలకు వీఆర్

ఒంగోలు టౌన్: జిల్లాలోని ఆరుగురు ఎస్‌ఐలను ఒంగోలు వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. పుల్లలచెరువు ఎస్‌ఐ ఎండీ ఫిరోజ్ ఫాతిమా, పొదిలి ఎస్‌ఐ గడ్డం కోటయ్య, మార్కాపురం ఎస్‌ఐ ఎం. వెంకటేశ్వర్లు నాయక్, దర్శి ఎస్‌ఐ ఆర్ సుమన్, జరుగుమల్లి ఎస్‌ఐ వి. వెంకటేశ్వరరావు, పొన్నలూరు ఎస్‌ఐ ఎంవీ రాజేష్‌లను వీఆర్‌కు పిలిచారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ బి. మహేంద్రను పుల్లలచెరువుకు అటాచ్ చేశారు.

ఒంగోలు టూటౌన్ సీఐగా మేడా శ్రీనివాసరావు

గుంటూరు రేంజ్ పరిధిలో పలువురు సీఐలకు పోస్టింగులు ఇస్తూ రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు టూ టౌన్ సీఐగా మేడా శ్రీనివాసరావును బదిలీ చేశారు. ఆయన ప్రస్తుతం ఏపీ ఇంటలిజెన్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే రేంజి వీఆర్‌లో ఉన్న టి. వెంకటేశ్వరరావును పొదిలి సర్కిల్‌కు బదిలీ చేశారు.

గుర్తుకొస్తున్నాయి!



ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు అభినందనలు తెలుపుతున్న క్లాస్‌మేట్స్

ఒంగోలు టౌన్: ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను ఆయన తో కలిసి చదువుకున్న ఒంగోలు ప్రాంతానికి చెందిన కొందరు మిత్రులు శుక్రవారం కలిశారు. 1994–96లో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో చదువుకున్న నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడుకు చెందిన డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, కందుకూరుకు చెందిన డాక్టర్ నల్లపోతు వెంకటేశ్వర్లు, సంతనూతలపాడుకు చెందిన ఎంఎస్ఎస్ అంజనేయులు, లింగంగుంట్లకుచెందిన గోరంట్లశ్రీమన్నారాయణ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. వారిని సాదారంగా ఆహ్వానించిన ఎస్పీ ఏఆర్ దామోదర్‌సమాచారం అడిగి తెలుసుకున్నారు.

బ్యాంకుకే కన్నం వేద్దామనుకున్నారు!

త్రిపురాంతకం: యూనియన్ బ్యాంక్ దోపిడీకి యత్నించిన నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ సాంబశివయ్య శుక్రవారం తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని మేడపి యూనియన్ బ్యాంక్‌ను దోపిడీ చేసేందుకు ఈనెల 1వ తేదీన నిందితులు సిద్ధమయ్యారు. బ్యాంక్ షట్టర్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి లాకర్ తాళాలు తెరిచేందుకు విఫలయత్నం చేశారు. కాగా నిందితుల చేస్తున్న దొంగతనం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. ఈ క్రమంలో మండలంలోని అన్నసముద్రం మెట్ట వద్ద శుక్రవారం మధ్యాహ్నం కంచర్ల వెంకటరమణ, జంగిటి సునీల్‌ను అరెస్ట్ చేశారు. బ్యాంకు దోపిడీకి ప్రయత్నించిన మహిళది అన్నసముద్రం కాగా గుంటూరు మిర్చి యార్డులో పనిచేస్తూ అక్కడే జీవనం సాగిస్తోంది. మరో నిందితుడు సునీల్ గుంటూరులోనే ఆటో నడుపుతుంటాడు. అలాగే నిందితులు వినియోగించిన ఆటోను సీజ్ చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక చర్యలకు దిగవద్దని సీఐ హెచ్చరించారు.

కన్నీటి సుడి గుండం



పల్లెలంటేనే పొలాలు, వాగులు, చెరువులు. ఇక సెలవులు వస్తే విద్యార్థులంతా ఈత సరదా తీర్చుకోవడానికి సంబర పడుతుంటారు. ఇటీవల చిన్నారులు కలిసి వాగులో ఈత వేద్దామని బయలుదేరారు. కానీ వారిలో ఒక్కరికీ ఈత కొట్టడంరాదు. అలా వారంతా ఉదయాన్నే వెళ్లి నీటిలో మునిగారు. అంతలోనే ఇద్దరు నీటిలో మునిగి ప్రాణాలు వదిలారు. ఇలా ముఖ్యంగా పల్లెల్లో చిన్నారుల ప్రాణాలు నీటిలో కలిసి పోతున్నాయి. వీటిని నిరోధించడంలో కేవలం ప్రభుత్వమే కాదు.. తల్లిదండ్రులూ జాగురూకతతో లేకుంటే విలువైన భావిపౌరుల ప్రాణాలు దక్కవు.

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి



ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నీటి కుంటల్లో, చెరువుల్లో నీరు చేరాయి. పాఠశాల సెలవులు ఇచ్చిన సమయంలో పిల్లలు ఈతకు వెళ్ల కుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు జాగ్రత్తలు చెప్పాలి. సంక్షేమ హాస్టళ్లలో ఉండే వారిపై యాజమాన్యం నిఘా ఉంచాలి. ఉపాధ్యాయుల పర్యవేక్షణలోనే క్రీడలు వంటివి నిర్వహించాలి. విద్యార్థులను ఇష్టం వచ్చినట్లు బయటకు పంపకూడదు.

యూవీ నారాయణ రెడ్డి
(ఎంఈఓ కనిగిరి)

- చిన్నారుల ప్రాణాలు తీస్తున్న ఈత సరదా
- పదుల కొద్దీ విద్యార్థుల మృత్యువాత
- కన్నవారు మరింత జాగ్రత్తగా చూసుకోవాలి
- పాఠశాలలు, హాస్టళ్ల యాజమాన్యాలూ బాధ్యత తీసుకోవాలి

కనిగిరి రూరల్:

సరదా కోసం కొంతమంది.. తోటి స్నేహితులను రక్షించడంలో మరికొంతమంది... ఇలా ఈత కోసం వెళుతున్న చిన్నారుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. ఇలాంటి ఘటనలు జిల్లాలో నిత్య కృత్యంగా మారుతున్నాయి. ఫలితంగా తల్లి దండ్రులకు గర్భశోకం మిగులుతోంది. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గత ఐదేళ్లలో సుమారు 15 మంది వరకు మృతి చెందడం అత్యంత విచారకరం. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతుకు చెందిన సుమారు 30 వేల మందికిపైగా చదువుతున్నారు. ఒక్క కనిగిరి మండలంలో 8,606 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలలు కలుపుకుంటే ఇంకా 15 వేల మంది అదనంగా ఉంటారు. వీరిలో బాలబాలికలు సమానంగా ఉంటారు. అలాగే వీరిలో వివిధ రకాల హాస్టళ్లలో ఉండి చదివే వారి సంఖ్య 30 శాతం వరకు ఉంటుంది. ఇంత మంది తమ స్వగ్రామాలకు వెళ్లినప్పుడు వారి బాధ్యతను కేవలం ప్రభుత్వమే చూసుకోలేదు కాబట్టి తల్లిదండ్రులు, పెద్దలు, బంధువులు విద్యార్థులను ఒక కంట కనిపెడుతూనే ఉండాలి.



పామూరులోని నీటి కుంటలో పడి చనిపోయిన విద్యార్థులను బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

- ఈనెల 10న శనివారం పామూరుకు చెందిన ఇద్దరు పదో తరగతి స్నేహితులు సరదాగా ఈత కోసం వెళ్లి మృతి చెందారు. పామూరు పట్టణానికి చెందిన వీరు సీఎస్‌పురం రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల పాతచెరువు గుంతలో దిగి పసుపులేటి చరణ్ (17) పసుపులేటి గౌతమ్(16) ఇద్దరు మృతి చెందారు.
- 2021 ఆగస్టు 15న మండలంలోని ఏరువారిపల్లి పాఠశాలలో చదువుతున్న పీసీపల్లి మండలం బట్టుపల్లికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇంటికి వెళ్తూ.. సరదాగా ఈత కోసం కంఠంవారిపల్లి చెరువులో దిగి మృతి చెందారు.



పి. చరణ్ (ఫైల్)



పి. గౌతమ్ (ఫైల్)



ఇండ్లా దినేష్ (ఫైల్)



ఇండ్లా లోకేష్ (ఫైల్)

- 2022 జనవరి 26న రిపబ్లిక్ డే రోజున చింతలపాలెం ఉన్నత పాఠశాలలో చదివే మండలంలోని పేరంగుడిపల్లికి చెందిన అన్నదమ్ములు నీటి గుంటలో పడి చనిపోయారు. రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం పేరంగుడిపల్లి–చిన ఇర్లపాడుకు మధ్యలో తీసిన గుంతల్లో పడి పేరంగుడిపల్లికి చెందిన ఇండ్లా దినేష్, ఇండ్లా లోకేష్ మృత్యువాత పడ్డారు.





కనిగిరి ప్రాంతంలో ప్రమాదకరంగా మారిన నీటి కుంటలు

విషాదకర ఘటనలు

- కొన్నేళ్ల క్రితం కనిగిరి నాగుల చెరువులో ఈత కోసం వెళ్లి ముగ్గురు విద్యార్థులు విగత జీవులుగా మారారు.
- అలాగే పీసీపల్లి హాస్టల్ విద్యార్థులు కూడా ఈత కోసం వెళ్లి నీటి గుంతలో పడి చనిపోయారు.
- హెచ్‌ఎంపాడులో మట్టి తవ్వకాల అనంతరం ఏర్పడిన గుంతలో దిగిన ఇద్దరు విద్యార్థులు దానిలో మునిగిపోయి మృతి చెందారు.
- పామూరు మండలంలో రెండేళ్ల క్రితం ఇద్దరు విద్యార్థులు ఈత కోసం వెళ్లి చనిపోయారు. దీంతో కన్నవారు తల్లడిల్లిపోయారు. భవిష్యత్ ఉన్న వారు ఇలా కావడం విషాదం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వివిధ రకాల ప్రభుత్వ వార్డెన్లు, నిర్వాహకులు విద్యార్థులు ఇంటికి బయలు దేరిన సమాచారాన్ని తల్లి దండ్రులకు చెప్పాలి. పది లోపు విద్యార్థులు అయితే సాధ్యమైనంత వరకు తల్లి దండ్రులు లేదా బంధువులతోనే వారిని ఇంటికి పంపించాలి.
- సెలవు రోజున స్కూల్, లేదా హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఇంటికి వెళ్లారు. ఎంత మంది పాఠశాలలోనే ఉన్నారనే పర్యవేక్షణను హెచ్‌ఎం, వార్డన్, యాజమాన్యం తీసుకోవాలి.
- క్రీడలు ఆడుకునే సమయంలో నీటి గుంతలు, చెరువుల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలి.
- 7వ తరగతి లోపు విద్యార్థులు ఇంటి మిద్దెలపై, కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోటకు వెళ్ల కుండా చర్యలు తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు ఇంట్లో నుంచి పిల్లలు స్నేహితులతో బయటకు లేదా దూరప్రాంతాలకు ఆడుకునేందుకు పంపించకూడదు. శివారు ప్రాంతాల్లో ఉండేవారు నీటి కుంటలు, చెరువులు వద్ద చిన్నారులను అప్రమత్తం చేయాలి.

భగ్గుమన్న వైద్య లోకం

- మహిళా డాక్టర్ హత్యాచార ఉదంతంపై ఆగ్రహ జ్వాలలు
- ఉద్యమబాటలో జూనియర్ డాక్టర్లు
- విధులు బహిష్కరించి నిరసన దీక్ష
- మద్దతుగా ప్రైవేటు వైద్యశాలల సమ్మెబాట
- జీజీహెచ్‌లో సేవలకు అంతరాయం



ఐఎంఏ అత్యవసర సమావేశంలో చర్చిస్తున్న నాయకులు



ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ వద్ద ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్‌లు

ఒంగోలు టౌన్: ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా వైద్యురాలిపై అత్యంత పాశవికంగా లైంగికదాడి చేసి దారుణంగా హత్య చేయడం హేయమైన చర్య అని ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఒంగోలు శాఖ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బొగ్గు శృతి అన్నారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యశాలలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నిరసిస్తూ దేశ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్ల సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీకి చెందిన జూనియర్ వైద్యులు శుక్రవారం జీజీహెచ్ ఆవరణలో దీక్ష ప్రారంభించారు. నో సేఫ్టీ, నో డ్యూటీ, వియ్ వాంట్ జస్టిస్, సెంట్రల్ ప్రొటెక్షన్ చట్టాన్ని అమలు చేయాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని.. జెండాలు ఎగరేసి పండుగలు చేస్తున్నారని కానీ ప్రతి ఏడాది మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్ ఆసుపత్రి రేప్ అండ్ మర్డర్ కేసులో మంత్రి కుమారుడి హస్తం ఉందని, బడా రాజకీయ నాయకుల ప్రమేయం వల్లనే నిందితులను ఇప్పటి వరకు అరెస్టు చేయకుండా అక్కడి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. గత రెండు నెలలుగా గంజాయి వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొంటున్నందు వల్లనే ఆమెను టార్గెట్ చేశారన్నారు. జూడా జనరల్ సెక్రటరీ ఒ. చైతన్య ప్రసంగిస్తూ లైంగిక దాడి.. హత్యకు సంబంధించిన సాక్ష్యాధారాలు లేకుండా చేసేందుకే నిందితులు ఆగస్టు 14 రాత్రి ఆసుపత్రిపై దాడికి బరితెగించారన్నారు. డాక్టర్ విష్ణు ప్రియ, కోశాధికారి డాక్టర్ బి. రాము, డాక్టర్ హర్షిత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల ఇబ్బందులు...

జూనియర్ వైద్యులు విధులను బహిష్కరించి నిరసన దీక్ష చేపట్టడంతో జీజీహెచ్‌కు వచ్చే రోగులు ఇబ్బందులు పడ్డారు. క్యాజువాలిటీ, ఓటీ, గైనిక్ వార్డు, అత్యవసర వార్డుల్లో జూనియర్ వైద్యులు నిత్యం వైద్య సేవలను అందిస్తుంటారు. జీజీహెచ్‌కు ప్రతి రోజూ 700 నుంచి 1000 మంది దాకా రోగులు వస్తుంటారు. ఎమర్జన్సీ వైద్యం కోసం 150 మందికిపైగా వస్తుంటారు.

నేడు ప్రైవేటు వైద్యశాలల సేవలు బంద్

ఒంగోలులోని ప్రైవేటు వైద్యులు 24 గంటల పాటు వైద్య సేవలను నలిపివేయనున్నారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు జిల్లాలో వైద్య సేవలను బంద్ చేయాలని ఐఎంఏ నిర్ణయించింది. శుక్రవారం జరిగిన అత్యవసర సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శ్రీదేవి తెలిపారు. అత్యవసర సేవలను మినహాయింపు ఉంటుందన్నారు. ఐఎంఏ రాష్ట్ర నాయకులు డాక్టర్ రావిపాటి జయశేఖర్, డాక్టర్ మన్నే వీరయ్య బాబు, డాక్టర్ జాలాది మణిబాబు పాల్గొన్నారు. కాగా శనివారం జీజీహెచ్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించాలి



కెరియర్ చార్ట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: విద్యార్థులకు పది, ఇంటర్ తర్వాత ఎలాంటి ఉద్యోగ అవకాశాలు, ఉంటాయి? వాటి కోసం ఏ కోర్సులు నేర్చుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించడం శుభ పరిణామమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. శుక్రవారం ప్రకాశం భవనంలో సమగ్రశిక్ష, రోటరీ సంయుక్తంగా రూపొందించిన కెరియర్ చార్ట్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ చార్టును ప్రతి పాఠశాలలో, జూనియర్ కాలేజీల్లో ప్రదర్శించాలన్నారు. డీఈఓ సుభద్ర, రోటరీ క్లబ్ రీజనల్ చైర్మన్ లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు మురళీకృష్ణ, సెక్రటరీ సురేంద్రబాబు, ట్రెజరర్ రామచంద్రారెడ్డి, కేంద్రీయ విద్యాలయ మాజీ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

కంభం: కుటుంబ కలహాల నేపథ్యంలో స్థానిక కాపవీధిలో నివాసం ఉంటున్న డింగిరి కమల(24) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం రాత్రి కంభంలో చోటు చేసుకుంది. భార్యా భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో కమల ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రజల మనిషి కలెక్టర్ కత్తి చంద్రయ్య

- ఘనంగా శత జయంతి ఉత్సవాలు
- 1971–73 మధ్య జిల్లా కలెక్టర్‌గా సేవలు
- పలు రాష్ట్రాల రిటైర్డ్ సెక్రటరీలు, ఐఏఎస్‌ల నివాళి



మాట్లాడుతున్న కర్ణాటక రిటైర్డ్ ఛీఫ్ సెక్రటరీ రత్న ప్రభ, వేదికపై ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీలు, ఐఎఎస్‌లు

ఒంగోలు సెంట్రల్: పేదల కలెక్టర్‌గా కత్తి చంద్రయ్య గుర్తింపు పొందారని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు కొనియాడారు. ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం కత్తి చంద్రయ్య శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అనేక కీలక పదవులు చేపట్టి సమర్థవంతమైన అధికారిగా మన్ననలు పొందారన్నారు. కర్ణాటక రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ కేకే రత్న ప్రభ మాట్లాడుతూ ప్రకాశం, గుంటూరు, హైదారాబాద్ జిల్లాల కలెక్టర్‌గా అన్ని వర్గాలకు మంచి చేసి.. ప్రజల కలెక్టర్ అనే చిరస్థాయి కీర్తి సంపాదించారన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి, సామాజిక సంస్కర్త, మంచి రచయిత అన్నారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరామక్రిష్ణమూర్తి మాట్లాడుతూ గూడు లేని పేదలకు నివాస స్థలాలు ఇచ్చి వేలాది కుటుంబాలకు మేలు చేసిన ఘనత చంద్రయ్యది అన్నారు. నేటికి ఆయా పట్టణాల్లో ఆయన పేరుతో కాలనీలు ఉండటం అందుకు నిదర్శమని చెప్పారు. చంద్రయ్య కుమారుడు రిటైర్డ్ ఐఎఎస్ ప్రదీప్ చంద్ర మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవ చేయాలన్న తపన ఆయన నుంచి నేర్చుకున్నామన్నారు. ఆయన తన రచనా వ్యాసాంగాల్లో సామాజిక మార్పు, పేదరిక నిర్మూలన, ఆర్థిక స్వావలంబన, జాతీయ సమైక్యత, మత సామరస్యం వంటి అనేక అంశాలను స్పృశించారని చెప్పారు. తెలంగాణ రిటైర్డు చీఫ్ సెక్రటరీ కె. ప్రదీప్ చంద్ర, రిటైర్డ్ ఐఎఎస్‌లు కె. ప్రఫుల్లచంద్ర, ఎ. విద్యాసాగర్, కె. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చంద్రయ్య విషయ పరిజ్ఞానం విస్తృతమైనదని అన్ని సామాజిక

శాస్త్రాల్లో సాధికారిత ఉండేదన్నారు. ముందుగా ఆయన చిత్ర పటానికి ఘన నివాళులర్పించారు. బాపట్ల ఎంపీ క్రిష్ణ ప్రసాద్, ఒంగోలు, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామక్రిష్ణమూర్తి, మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు సహించం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు హెచ్చరిక
- అధికారుల తీరుపై అసహనం



కమిషనర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని మున్సిపల్ అధికారులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు హెచ్చరించారు. స్థానిక కళాశాల రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనాన్ని అక్రమకట్టడంగా భావించి కూల్చివేసేందుకు కమిషనర్ కిరణ్ తన సిబ్బందితో శుక్రవారం అక్కడకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న అన్నా రాంబాబు, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్, పార్టీ పట్టణాధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, మాజీ ఏఎంసీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు మారం రెడ్డి కిట్టు, బి. బాలకృష్ణారెడ్డి తదితరులు నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు వచ్చారు. పట్టణ పరిధిలో గతంలోనే చాలా అక్రమంగా భవన నిర్మాణాలు చేపట్టారని, వారందరికీ మినహాయింపు ఇచ్చి ఈ భవనాన్ని కూల్చడంలో ఉద్దేశమేమిటని ప్రశ్నించారు. రాజకీయ వేధింపులను మానుకోకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని స్పష్టం చేశారు. ఇదే సమయంలో మార్కాపురం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, రాజకీయ కోణంలో అధికారులు వ్యవహరిస్తే మాత్రం సహించేది లేదన్నారు. పట్టణంలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నింటినీ గుర్తించి వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కిరణ్ మాట్లాడుతూ పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలకు నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడటంతో పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తన సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అధికారులు దుందుడుకు చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.